క్లుప్తంగా

ఆక్రమణ స్థలంలో మొక్కలు నాటిన అధికారులు



మొక్క నాటుతున్న ఆర్డీఓ వెంకట సన్యాసిశర్మ, అధికారులు

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని కదిరి–హిందూపురం రోడ్డు పక్కనున్న టిడ్కో భవన సముదాయాల ముందు ఖాళీ స్థలంలో శనివారం అధికారులు మొక్కలు నాటారు. ఈ స్థలంలో కొందరు కంచెవేసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తుండగా కంచెను రెవెన్యూ సిబ్బందితో తొలగించి మొక్కలు నాటారు. భవిష్యత్తులో ఇక్కడ ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వెంకటసన్యాసిశర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, పట్టణ సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐ సుమతి, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ



లిఖిత్‌కు బ్యాగ్‌ను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

కదిరి అర్బన్: బస్సులో బ్యాగ్ మరచిపోయిన ప్రయాణికుడికి తిరిగి బ్యాగ్ అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు డ్రైవర్ లక్ష్మీనారాయణ. ఈనెల 16న లిఖిత్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగుళూరు నుంచి కదిరి వచ్చాడు. కదిరిలో దిగాక బస్సులో తన బ్యాగ్ మరచి వెళ్లిపోయాడు. అందులో ల్యాప్‌టాప్, 10 జతల దుస్తులున్నాయి. బస్సులో మరచిన బ్యాగును డ్రైవర్ డిపోలో అందజేశాడు. లిఖిత్ శనివారం డిపోలో సంప్రదించగా అసిస్టెంట్ డిపో క్లర్క్ సలీంబేగ్, డిపో కార్యదర్శి బైరిశెట్టి సెక్యూరిటీ సమక్షంలో బ్యాగ్‌ను అందజేశారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు అందించిన దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు సత్యసాయి భక్తుల సహకారంతో సైకిళ్ల పంపిణీ చేసినట్లు హెచ్ఎం శ్రీకాంత్ శనివారం తెలిపారు. కొట్లాలపల్లి, చంద్రాయునిపల్లి నుంచి వచ్చే 18 మంది విద్యార్థులకు ఎనుములపల్లి ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ సహకారంతో సైకిళ్లు అందించామన్నారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు చెన్నుడు తదితరులు పేర్కొన్నారు.

జీవన ఎరువుల వినియోగం పెంచండి



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య

ముదిగుబ్బ: రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి జీవన ఎరువుల వినియోగాన్ని పెంచాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య సూచించారు. జొన్నలకొత్తపల్లి గ్రామ సచివాలయంలో శనివారం జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన జీవన ఎరువులతో ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. సూడోమోనాస్, అజటో బాక్టర్, రైజోబియం వంటి జీవన ఎరువులను వాడుకోవచ్చునన్నారు. ఏఓ రవీంద్ర, ఏఈఓ మనోహర్, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రియాంక, ఎంపీఈఓ తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

అక్షరాస్యతకు కృషి చేయండి

ధర్మవరం రూరల్: సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలని ఎంఈఓ రాజేశ్వరీదేవి వలంటీర్లకు సూచించారు. స్థానిక దుర్గాభవాని మండల మహిళా సమాఖ్య భవనంలో శనివారం ఉల్లాస్–అక్షర ఆంధ్ర కార్యక్రమంపై వలంటీర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. అక్షర కేంద్రాల నిర్వహణ, బోధన విధానంపై వలంటీర్లకు వయోజన విద్య పర్యవేక్షకులు వెంకటరమణ శిక్షణ ఇచ్చారు. ఏపీఎం రఘునాథరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రత పోలీసుల బాధ్యత

ధర్మవరం అర్బన్: ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో శనివారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాలపై ప్రజలకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా డీఎస్పీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి సాక్ష్యం



శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల భవనం



వైద్యశాల భవనంపై మొలిచిన చెట్లు

నల్లచెరువు: మండల కేంద్రంలోని పశువైద్యశాల శిథిలమై కూలటానికి సిద్ధంగా ఉంది. ఏకంగా పశువైద్య శాల గోడలపై పెద్దపెద్ద చెట్లు పెరగడంతో వాటి వేర్లు గోడల్లోకి వెళ్లి పగుళ్లు రావడంతో చిన్నపాటి వర్షానికే గోడలు మొత్తం తడిసిపోయి ఆసుపత్రి భవనం పై కప్పు కారుతోంది. దీంతో భవనం ఎప్పుడు కూలుతుందో తెలయని దుస్థితి నెలకొంది. కనీసం మందులు, ఇతర వైద్య పరికరాలు కూడా భద్రంగా ఉంచుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి. దీంతో ఆసుపత్రిలోని సిబ్బంది, కాంపౌండర్లు భయం భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వైద్య, సిబ్బంది మండల ప్రజలు కోరుతున్నారు.



వైద్యశాల గోడపై ఉన్న చెట్లు వేర్లతో పగుళ్లు వచ్చిన దృశ్యం



వర్షానికి పశువైద్యశాలలో తడిసిపోయిన వైద్య పరికరాలు

‘కూటమి’ కుట్రలను తిప్పికొడదాం

ముదిగుబ్బ: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే కూటమి కుట్రలను కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ద్వారా తిప్పికొడదామని వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందుకూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు సైతం వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 17 వైద్య కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రైవేటీకరణ పేరుతో తమ అనుచరులకు అప్పగించేందుకు సీఎం చంద్రబాబు కుట్రపన్నారన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నుంచి విస్తృతంగా చేపడతామన్నారు. మహిళా విభాగం నియోజకవర్గ నేత కదిరిసాని జయమ్మ, సర్పంచ్ లక్ష్మీదేవి, చంద్రాయుడు, వైస్ ప్రసిడెంట్ చవ్వా లోకేశ్వర్‌రెడ్డి, మండల యూత్ నాయకుడు మనోహర్, ముదిగుబ్బ మండల మహిళా నేత లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

కదిరి అర్బన్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, జిల్లా మాజీ అధ్యక్షుడు పవన్ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతున్న బస్సు జాతాలో పెద్దెత్తున విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బస్సుజాతకు సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు గణేష్, శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.



బస్సుజాతా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రతి విద్యార్థీ సృజనాత్మకంగా ఆలోచించాలి

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టీఎం బషీర్ తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం లక్ష్మయ్య అధ్యక్షతన చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బషీర్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సామాజిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే సైన్స్‌ను ప్రచారం చేయడంలో జేవీవీ కృషి అభినందనీయమని తెలిపారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందినప్పటికీ చేతబడి చేస్తున్నారని అమాయకులను చంపేస్తున్నారంటే దానికి కారణం మూఢ నమ్మకాలేనని వివరించారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాలు ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్, ఉపాధ్యాయులు హరికృష్ణ, రామకృష్ణ, హనుమంతు, రామ్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.



చెకుముకి ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు

లింగాల లోకేశ్వరరెడ్డికి సన్మానం

గాండ్లపెంట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మండల పార్టీ పరిశీలకుడిగా నియమితులైన లింగాల లోకేశ్వరరెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, మండల మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎంపీపీ తాతం జగన్మోహన్, కమతంపల్లి ఉప సర్పంచ్ ఫక్రుద్దీన్, మండల యూత్ అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, పామిడి ఇక్బాల్, ఎస్సీసెల్ నాయకుడు మేకల నరసింహులు, మండల వైస్‌కన్వీనర్ శంకర్‌నాయుడు, అనుబంధ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



లోకేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

ధర్మవరం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆర్డీఓ మహేష్ ప్రజలకు సూచించారు. శనివారం ఏలుకుంట్ల గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామంలో ముందుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, ఏపీఓ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిమర్రి: పచ్చని చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మండల ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిడిగల్లులోని పంచాయతీ కార్యాలయం, గ్రామ సమీపంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి మాన్యం భూముల్లో ఆమె మండల అధికారులతో కలసి శనివారం మొక్కలను నాటారు. ఎంపీడీఓ వెంకట రంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫమీద పర్వీన్, ఏపీఎం సాంబశివుడు, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా జెడ్పీటీసీ సుధ, ఎంపీడీఓ నరసింహనాయుడు మొక్కలు నాటారు. విద్యార్థలతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల హెచ్ఎం జయంతి, కార్యదర్శులు నారాయణస్వామి, ముత్యాలనాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది చెత్తాచెదారం తొలగించారు. సీహెచ్ఓ ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, పాఠశాల హెచ్ఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని, అందువల్ల ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచించారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ‘స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలో ఎంపీడీఓ బాలకృష్ణుడు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు.



ఏలుకుంట్లలో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ మహేష్

‘సూర్యఘర్’తో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్

పుట్టపర్తి టౌన్: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే సింధూరారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సత్యమ్మ ఆలయం వద్ద ప్రధాన మంత్రి సూర్యఘర్, జీఎస్టీ సేవింగ్స్‌పై ప్రజలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించడంతో సగటున ప్రతి మనిషికి రూ.20వేల నుంచి రూ.40 వేల వరకు లబ్ధి చేకూరిందన్నారు. ఆర్డీఓ సువర్ణ విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, పరిశ్రమల జిల్లా అధికారి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి, సీఐ శివాంజనేయులు, విద్యుత్ ఈఈ శివరాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ మహేష్ సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఆర్డీఓ హాజరై మాట్లాడారు. విద్యుత్ ఏడీ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ధరలతోనే సోలార్ ప్యానల్ విక్రయించాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈలు, ఇతర శాఖల అధికారులు, ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సంక్షిప్త సమాచారం

మాజీ సర్పంచుకు సన్మానం



మాజీ సర్పంచ్ రాంమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నల్లమాడ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యుల్లో ఒకరైన మూలప్పగారిపల్లికి చెందిన వెంకటేష్‌ను మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత ఎస్. రాంమోహన్‌రెడ్డి పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ సతీష్ కుమార్ మాజీ సర్పంచ్ ఎస్. రాంమోహన్‌రెడ్డి, ఆయనకు సహకరించిన నిందితుడు వెంకటేష్ సోదరి దుర్గ, బావ మహేంద్రను శనివారం తన కార్యాలయానికి పిలిపించుకొని దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రస్తుతం మసకవంకపల్లి సర్పంచ్‌గా రాంమోహన్‌రెడ్డి భార్య అరుణమ్మ ఉన్నారు. డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొత్తచెరువు: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డీఎస్పీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తచెరువు యూపీఎస్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పోతులకుంట గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలపై అఘాయిత్యాలు, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ నియమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సమ్మె విరమణ శోచనీయం

కదిరి టౌన్: విద్యుత్ కార్మికుల డిమాండ్లు నెరవేరకుండా జేఏసీ సమ్మె విరమించడం శోచనీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్మికుల డిమాండ్లు నెరవేరేదాకా పోరాటాలు చేస్తామని తెలిపారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

ధర్మవరం రూరల్: క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు విద్యార్థినులకు సూచించారు. శనివారం మోటుమర్ల వద్దనున్న కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు తదితర వాటిపై అవగాహన కల్పించారు.

రెవెన్యూ దందా



వాహనం నిండా తరలిస్తున్న టపాసులు

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో దీపావళి సందర్భంగా తాత్కాలిక టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. కదిరి ఆర్డీఓ సన్యాసి శర్మ పేరు చెప్పి రెవెన్యూ సిబ్బంది కొందరు అక్కడున్న ప్రతి దుకాణం వద్దకు వెళ్లి టపాసుల దందా మొదలెట్టారు. ప్రతి దుకాణం వద్ద కలెక్షన్ చేసిన టపాసులు ఒక వాహనంలో తరలించడం కనిపించింది.

వాలీబాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మధురవాణి, పీఈటీ యమున తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17వ తేదీన చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించగా..మేడాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారన్నారు. దీంతో నిర్వాహకులు వేదశ్యాం, కులవర్ధన్, యశ్వంత్‌రెడ్డిలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.

సభా వేదిక నిర్మాణానికి భూమి పూజ

కొత్తచెరువు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సుమారు రూ.10 లక్షలలో సభావేదిక నిర్మాణానికి శనివారం భూమి పూజచేశారు. పాఠశాలలో 18 ఏళ్లు హెచ్ఎంగా పని చేసిన నరసప్ప జ్ఞాపకార్థం వారి పిల్లలు డాక్టర్ త్రివేణి, వెంకటనరసయ్య సభా వేదిక నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల హెచ్ఎం గోపాల్, వెంగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ‘రచ్చబండ’

ఓడీచెరువు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా ఆదివారం టి.కుంట్లపల్లి, వెంకటాపురం, ఇనగలూరు, మిట్టపల్లి, కొండకమర్ల, శేషయ్యగారిపల్లి తండాలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మండల వాసి



మహబూబ్‌బాషా

ఎన్పీకుంట: గొకనపల్లి గ్రామానికి చెందిన ఎస్.మహబూబ్‌బాషా డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి జీవితంలో అనేక విజయాలు సాధించారు. మొదట ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలు ప్రారంభించి ఆయన గ్రూప్స్‌లో ప్రతిభ కనబరిచి డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించారు. ఉరవకొండ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన తాజాగా డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం రూరల్: కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో నాయకులు జంగాలపల్లి పెద్దన్న, మారుతి అధ్యక్షతన సంఘ మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా రేగాటిపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ఎ.మారుతి, సహాయ కార్యదర్శిగా తుంపర్తి చెన్నారెడ్డి, కోశాధికారిగా రవి, సభ్యులుగా గరుడంపల్లి చిన్నరాముడు, పల్లి శివారెడ్డి, నర్సింహారెడ్డి, గొట్లూరు పోతులయ్య, గరుడంపల్లి పోతులయ్య, చంద్రశేఖర్, నారాయణస్వామి ఎన్నికయ్యారు.

‘సురక్ష యాప్’ ద్వారానే మద్యం విక్రయాలు

- ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య



చెన్నేకొత్తపల్లిలోని మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

చెన్నేకొత్తపల్లి: ‘సురక్ష యాప్’ ద్వారానే మద్యం విక్రయాలు సాగించాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య మద్యం దుకాణాల నిర్వాహకులను ఆదేశించారు. శనివారం ఆయన ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ ఫరూక్ ఆజాం, ఎస్ఐ శివప్రసాద్‌తో కలసి చెన్నేకొత్తపల్లిలోని మద్యం దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల మేరకే మద్యం విక్రయించాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రాకుండా గట్టి నిఘా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో స్థానిక ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందిస్తున్న ఉప సర్పంచు కోటి గోపినాథ్

బత్తలపల్లి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం బత్తలపల్లి మేజర్ పంచాయతీ ఉప సర్పంచు కోటి గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు కార్మికుల సేవలను కొనియాడారు.

రీ సర్వే పక్కాగా చేయాలి

కనగానపల్లి: దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రీసర్వేను పక్కాగా చేయాలని డీఏ శ్యాముల్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని ముక్తాపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, సర్వే సిబ్బందితో మాట్లాడారు. రీ సర్వే ద్వారా పక్కాగా కొలతలు వేసి రస్తా, గట్ల తగదాలు, భూ విభాగ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ కరుణాకర్, స్థానిక రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.